తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
11 నవంబర్ 2026
పేజీలు : 08
Follow :





యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం

పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి చేయూత

ఆప్టిమస్ గ్రూప్ చైర్మన్ డి. శ్రీనివాసరెడ్డి

ఒక మంచి కార్యక్రమానికి దాతలు ముందుకు రావడం సంతోషం : డిజిపి సివి ఆనంద్



శేరిలింగంపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) :

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి 50 లక్షల రూపాయల విరాళం అందించారు. మంగళవారం మైండ్ స్పేస్ లోని పెరెల్ క్లబ్ లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశంలో రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ కు డీజీపీ సీవీ ఆనంద్‌కు డి శ్రీనివాస్ రెడ్డి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి తదితరులు మాట్లాడుతూ నిధులను పాఠశాలలో తరగతి గదులు, సైన్స్, టెక్నాలజీ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలతోపాటు సాధారణ ప్రజల కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్యను అందించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ క్రమంలో ఒక మంచి ఆశయంకోసం భారీ విరాళం అందించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డిని డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు ముందుకొచ్చి సహకారం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పోలీసులంటే తనకు ఎంతో గౌరవమని, సమాజ భద్రతకోసం వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విద్య ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, వారి పిల్లలు మరియు జీవిత భాగస్వాములకు కొత్త నైపుణ్యాలు నేర్చుకుని, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు 'సంక్షేమ వారధి' అనే ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. పోలీసు సిబ్బంది నిరంతరం ప్రజల భద్రతకోసం విధులు నిర్వహిస్తూ ఎంతో సమయం, శ్రమను వెచ్చిస్తుంటారని, వారి సేవలను గుర్తిస్తూ వారి పిల్లలు మరియు జీవిత భాగస్వాములకు కూడా మంచి భవిష్యత్తు కోసం అవసరమైన నైపుణ్యాలను నేర్చుకునే అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఆశయానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ సాంకేతిక, వృత్తి విద్యా మరియు ఉపాధికి ఉపయోగపడే రంగాల్లో శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందడం, స్వయం ఉపాధి ప్రారంభించడం లేదా తమ ఆసక్తికి అనుగుణంగా మంచి కెరీర్‌ను నిర్మించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సంక్షేమ వారధి కార్యక్రమంలో అందించే కోర్సులు ప్రధానంగా... కంప్యూటర్ బేసిక్స్ మరియు ఎమ్మెస్ ఆఫీస్, ఏఐ టూల్స్ - డాక్యుమెంట్ల తయారీ, డేటా సేకరణ మరియు విశ్లేషణ, సిసి టివి రిపేరింగ్, వెల్డింగ్, సోలార్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ, 3డి ప్రింటింగ్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ, సిఎన్సి మరియు సంబంధిత సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మొబైల్ రిపేరింగ్, సెమీకండక్టర్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్, ఆటోమేషన్, కాస్మటాలజీ, ఫ్యాషన్ డిజైనింగ్, స్కిల్ ఇండియా /టామ్‌కామ్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాలు, శిక్షణ విధానం మరియు ఇతర అంశాలను తెలియజేయడానికి నేడు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమం అనంతరం శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని సిపి డాక్టర్ ఎం రమేష్ మీడియాకు వివరించారు. 'సంక్షేమ వారధి' ద్వారా పోలీసు సిబ్బంది పిల్లలు మరియు జీవిత భాగస్వాములు తమ ఆసక్తికి అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు సైబరాబాద్ పోలీస్ శాఖ మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేసే పోలీసు సిబ్బంది సంక్షేమంతో పాటు, వారి పిల్లలు మరియు జీవిత భాగస్వాముల అభివృద్ధి, భవిష్యత్తుకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలనే సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ గారి ఆలోచనకు ఈ కార్యక్రమం నిదర్శనమని పలువురు పోలీస్ అధికారులు ప్రస్తావించారు.



మెరిడియన్ స్కూల్‌పై అక్రమ షెడ్ నిర్మాణం

విద్యార్థుల ప్రాణాల కంటే నిర్మాణాలే ముఖ్యమా?

- మెరిడియన్ స్కూల్‌లో అదనపు ఫ్లోర్ నిర్మాణంపై తీవ్ర ఆరోపణలు!
- తరగతులు జరుగుతుండగానే నిర్మాణ పనులు..
- ప్రమాదం పొంచి ఉందంటున్న తల్లిదండ్రులు
- ఎంఇఓ, డిఇఓ, మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నట్లు..?
- తక్షణమే క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి!

లోపలి పేజీలో

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన పాఠశాలలే వారి భద్రతకు ముప్పుగా మారితే పరిస్థితి ఏమిటి? విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన యాజమాన్యమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వస్తే బాధ్యత ఎవరిది? కేపీహెచ్‌బీలోని మెరిడియన్ పాఠశాలలో జరుగుతున్న అదనపు అంతస్తు నిర్మాణ పనులపై ప్రస్తుతం ఇలాంటి ప్రశ్నలే తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి.

కూకట్‌పల్లి, నవంబర్ 10:(జనంసాక్షి):



కేసారం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం

వారం రోజులుగా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు



చేవెళ్ల, నవంబర్ 10 (జనంసాక్షి) చేవెళ్ల మండలం కేసారం గ్రామా నికి చెందిన కావలి రవీందర్ (39) అదృశ్యమయ్యాడు. వారం రోజు లుగా ఆచూకీ లభించక పోవడంతో అతని తండ్రి కావలి నారాయణ మంగళవారం చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కావలి నారాయణ చిన్న కుమారుడైన రవీందర్ ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. నవంబర్ 3వ తేదీన తన కుమార్తె మాధవికి ఫోన్ చేసి మాట్లాడిన అనంతరం అతని ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించారు. అదృశ్యమైన రవీందర్ ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామనచాయ కలిగి ఉంటాడని, తెలుగు మాట్లాడుతాడని పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసినవారు లేదా ఎక్కడైనా కనిపించినట్లయితే 9346816705 నంబర్‌కు లేదా చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

యాలాలలో ఘోర రోడ్డు ప్రమాదం పలువురికి తీవ్ర గాయాలు



యాలాల అక్టోబర్ 10 (జనం సాక్షి) : యాలాల మండల పరి ధిలోని ఎన్కేపల్లి గేటు వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొనడంతో ఆటో తీవ్రంగా ధ్వంసమైంది. ఈ ప్రమా దంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలైనట్లు సమా చారం.ప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను బయటకు తీసి, చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. ప్రమాదం ఎలా జరిగింది? లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.రోడ్డు భద్రతపై అధికారుల పర్యవేక్షణ పెంచాలని, వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ



శామీర్ పేట, నవంబర్ 10 (జనం సాక్షి)శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

ఓటు హక్కు కోల్పోయిన వారికి మరో అవకాశం

శంకర్‌పల్లి మండలంలో ఏ ఎస్ డి డి జాబితాలో 7,628 మంది ఓటర్లు

శంకర్ పల్లి, నవంబర్ 10 (జనం సాక్షి)భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని 48 పోలింగ్ కేంద్రాల పరిధిలో 7,628 మంది ఓటర్లు ఏ ఎస్ డి డి జాబితాలో నమోదైనట్లు తహసీల్దార్, తెలిపారు. మొత్తం 37,828 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేయగా, మృతి చెందినవారు 800 మంది, శాశ్వతంగా వలస వెళ్లినవారు 2,868 మంది, ఇప్పటికే ఇతర చోట్ల నమోదైన వారు 2,458 మంది, అందుబాటులో లేనివారు 1,432 మంది ఉన్నట్లు వెల్లడించారు. నవంబర్ 21వ తేదీలోగా సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ లను సంప్రదించి అవసర మైన ఆధారాలతో వివరాలు సమర్పించాలని సూచించారు. ఓటరు హక్కును కోల్పోకుండా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్, ఏఈఆర్ఓ కోరారు.

మండల సమావేశంలో అధికారులపై సర్పంచుల ఆగ్రహం

- **పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి..ఇరిగేషన్ అధికారులపై ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆగ్రహం**
- **ఎల్ఎన్‌నో ప్రభావంతో నీరు,విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలి:ఎమ్మెల్యే సూచన**



శంకర్‌పల్లి, నవంబర్ 10 (జనం సాక్షి):మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించేందుకు మండల పరిషత్ కార్యాల యంలో మంగళవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిం చారు.ఈ సందర్భంగా పలువురు గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో సమావేశం వాడీవేడిగా సాగింది.సమావేశంలో సర్పంచుల అసంతృప్తి.. అధికారుల తీరుపై నిలదీత!పలు శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ఎజెండా అంశాలను వివరించగా, అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచులతో సమావేశాలు నిర్వహించడం లేదని పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామాల్లో ప్రజాప్రతి నిధులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆలం ఖాన్‌గూడ గ్రామంలో తక్కువ వోల్టేజీ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ మాధవి శ్రీనివాస్ గౌడ్ సమావేశంలో ప్రస్తావించారు.దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారి 100 కేవీ సామర్థ్యం కలిగిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని, త్వరలోనే ఏర్పాటు పనులు పూర్తి చేస్తామని తెలిపారు.అలాగే గ్రామంలో తాగునీటిని వృథా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు సూచించినప్పటికీ, పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొండకల్--శేరిగూడ రోడ్డు వెంబడి ప్రజల సౌకర్యార్థం వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ నివేదిత ఇంద్రసేనారెడ్డి కోరారు.ఎల్ఎన్‌నో ప్రభావంతో రాబోయే రోజుల్లో విద్యుత్ కోతలు,నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యగా గ్రామాల్లో చేతిపంపుల బోర్లకు మరమ్మతులు చేయించి అందుబాటులో ఉంచాలని గోపులారం సర్పంచ్ రవీందర్ రెడ్డి సూచించారు.ఇరిగేషన్ శాఖపై వెల్లువెత్తిన ఫిర్యాదులు..ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం!మోకిలా సర్పంచ్ శేఖర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల సర్పంచులు ఇరిగేషన్ శాఖ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.మోకిలా గ్రామంలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పనులు మాత్రం సంబంధిత అధికారులు వేగంగా పూర్తి చేస్తున్నారని, గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను మాత్రం నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.. త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో వి.ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సురేందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, మోకిలా పీఏసీఎస్ చైర్మన్ గౌంద్ర సత్యం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేందర్ గౌడ్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో అంగరంగ వైభవంగా సదర్ సమ్మేళనం

యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు మల్లారెడ్డి,తలసాని శ్రీనివాస్ యాదవ్,డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



బోడుప్పల్-జనంసాక్షిమేడిపల్లి మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళన వేడుకలను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల యాదవ సంఘం అధ్యక్షుడు పాశం బుచ్చి యాదవ్ అధ్యక్షతన మేడిపల్లిలోని హనుమాన్ టెంపుల్ ఆవరణలో జరిగిన ఈ వేడుకలకు ఎమ్మెల్యేలు మల్లారెడ్డి,తలసాని శ్రీనివాస్ యాదవ్,డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు.యాదవుల సంస్కృతి, సంప్రదా యాలు,ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళనాన్ని పురస్కరించుకొని ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.శ్రీకృష్ణుడి ఆశీస్సులతో సమాజంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, యాదవులందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.సదర్ పండుగ యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు,పశు సంపద ప్రాధాన్యతను చాటిచెప్పే విశిష్టమైన పండుగ అని వక్తలు పేర్కొన్నారు.తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇటువంటి వేడుకలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, వారసత్వాన్ని చాటిచెబుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి,పీర్జాదిగూడ డివిజన్ అధ్యక్షుడు బండి శ్రీరాములు,మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,సదర్ సమ్మేళన నిర్వాహకులు మధుగాని దేవేందర్ యాదవ్,పాశం రాజు యాదవ్,పాశం సత్యం యాదవ్,అత్తిసమోని రాజు యాదవ్,గుండెబోయిన అయోధ్య యాదవ్,గుండాల సత్యనారాయణ యాదవ్, ఎర్రం సత్యనారాయణ యాదవ్, మధు యాదవ్,జుర్రు వేణుగోపాల్ యాదవ్, పాపులు యాదవ్,వెంకటేశ్వర్లు యాదవ్,చింతల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి



హయత్ నగర్, నవంబర్ 10 (జనం సాక్షి)దీపావళి పండుగను పురస్కరించుకొని హయత్ నగర్‌లో యాదవ సోదరులు ఘనంగా నిర్వహించిన సదర్ సమ్మేళన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా అలంకరించిన దున్నపోతులు, డప్పు చప్పుళ్లు, ఆటపాటలతో నిర్వహించిన వేడుకలను ఆయన ఆసక్తిగా తిలకించారు.అనంతరం మాట్లాడుతూ సదర్ సమ్మేళనం యాదవ సోదరుల ఐక్యతకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ గొప్ప సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. యాదవ, కురుమ సోదరుల అభివృద్ధి, సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఉగాది కాంప్లెక్స్ వద్ద ఉగాది కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలోనూ ఆయన పాల్గొని నిర్వాహకులకు, వేడుకల్లో పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకుడు జనార్ధన్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఉగాది బాలు, బీజేవైఎం నాయకుడు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా ఎర్రజెండా

హక్కుల కోసం అసెంబ్లీని ముట్టడిస్తాం
మాజీ ఎంపీ బాబూరావు

ముషీరాబాద్ నంబర్ 10 (జనం సాక్షి):విల్లంబులు ఎక్కుపెట్టి, నృత్యం చేస్తూ సాగిన ఆదివాసీ మహా ప్రదర్శన తమ హక్కుల కోసం పోరాడుతున్న ఆదివాసీలకు ఎర్రజెండా అండగా ఉంటుందనీ, ప్రభుత్వం దిగొచ్చి వారి సమస్యలను పరిష్కరిచకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. ఆదివాసీలకు ఎస్టీ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివాసీలు మహాప్రదర్శన నిర్వహించారు. ఆదివాసీ పురుషులు విల్లంబులు ఎక్కుపెట్టి, కొమ్ము డోలు కళాకారులు ప్రదర్శనలు చేస్తూ ముందుకు సాగారు. మహిళలు ఆదివాసీ నృత్యప్రదర్శన చేశారు. మహాప్రదర్శనకు ఆదివాసీలు వేలాది మంది తరలొచ్చారు. తమ మాండలికంలో నినాదాలు చేశారు. అనంతరం ఇందిరాపార్కు వద్ద సీపీఐ(ఎం) ములుగు జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అధ్యక్షతన జరిగిన సభలో జాన్‌వెస్లీ మాట్లాడారు. ఆదివాసీలు అడవుల్లో ఒకచోట స్థిర నివాసం ఉండకుండా సంచరిస్తూ జీవిస్తారనీ, వారు తరుచూ ఒక చోట నుంచి మరో చోటుకు వలస వెళ్తారని చెప్పారు. ఆదివాసీలు తమ వారు కాదని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం....తమ రాష్ట్రం వారు కాదని తెలంగాణ ప్రభుత్వం అనటం సరిగాదన్నారు. బతకడం కోసం వలసెళ్తే హక్కులను తీసేస్తారా? ఇదేం న్యాయం? 30 ఏండ్ల నుంచి ఉంటున్నవారు మనుషులు కాకుండా పోతారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. వారికి ఎస్టీ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి విద్యా, వైద్య, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలనీ, హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖనిజ సంపద లూటీ చేసేందుకు అంబానీ, అదానీల కోసం అడవుల్లో రోడ్లు వేయడానికి చట్టాలు అడ్డురావుగానీ...ఆదివాసీ గూడాలకు రోడ్లు వేయడానికి, నీటి, విద్యుత్ సౌకర్యాలు కల్పించడానికి నిబంధనలు అడ్డొస్తాయా? అని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అడవులను దోచుకునే కార్పొరేట్లకు అండగా ఉండటం...అడవిలో పుట్టి...అడవిలో పెరిగి..ప్రత్యేక అనుబంధంతో అడవులను సంరక్షించే ఆదివాసీలపై మోదీ సర్కారు దాడులు చేయించడం దుర్మార్గమని విమర్శించారు. ఆదివాసీలు ఓట్లేస్తేనే సీతక్క గెలిచి మంత్రి అయ్యారనీ, ఇప్పుడు వారి హక్కుల కోసం ఎందుకు మాట్లాడటం లేదని అడిగారు. ఆదివాసీలు తమ హక్కుల కోసం తెగబడి పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ నేత, మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ...ఆ గడ్డ నుంచి గెలిచి ఆదివాసీ తెగకు చెందిన సీతక్క మంత్రి కావడం గొప్పవిషయమేననీ, అయితే, ఆదివాసీలకు ఆమె ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కోరారు. కోయలో 13 రకాల తెగలుంటాయనీ, నిజమైన ఆదివాసీలెవ్వరూ అబద్దాలు చెప్పకుండా విలువలతో బతుకుతారని చెప్పారు. ఎన్నికల ముందు ఎస్టీ సర్టిఫికెట్ ఇప్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిందనీ, ఇప్పుడు ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఒకలా...అధికారంలోకి వచ్చాక ఒకలా మాట్లాడటం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. ఫారెస్టు భూముల్ని సాగుచేసుకోవడం ఆదివాసీల హక్కు అనీ, ఇది అటవీ హక్కుల చట్టంలోనే పొందుపర్చారని గుర్తుచేశారు. ఆదివాసీలకు ఇప్పటివరకూ ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయనీ, పోడు వ్యవసాయం ఆ తెగల సాంప్రదాయం కాబట్టి వారికి హక్కు పత్రాలివ్వాలని పొందుపర్చిన విషయాన్నీ ప్రస్తావించారు. మోదీ సర్కారు అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడుస్తున్నతీరును ఎండగట్టారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు అవుతున్నా ఒక్క ఆదివాసీకి కూడా పోడుభూములకు సంబంధించిన హక్కు పత్రాలు ఇవ్వలేదని విమర్శించారు. ఆదివాసీలపై ఫారెస్టు అధికారుల దాడులను వెంటనే ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబితే ఫారెస్టు అధికారులు వినరా? అని ప్రశ్నించారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ...వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలనీ, పోడు సాగుదారులపై ఫారెస్టు అధికారుల దాడులను ఆపాలని కోరారు. పోడు భూముల్లోకి వెళ్లకుండా ఫారెస్టు అధికారులు కందకాలు తొవ్వడాన్ని ఆపాలనీ, ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సర్‌పేరుతో ఆదివాసీ ఓట్లను తొలగించొద్దన్నారు. సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జి.నాగయ్య, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌బాబు, ఆర్.వెంకట్రాములు, ఆశయ్య, అరుణజ్యోతి, కృష్ణారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు ఎ.వెంకటేశ్, టి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఉప్పల్ నియోజవర్గ మున్సిపల్ అధికారులతో సమీక్ష
సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా, నవంబర్ 10 (జనం సాక్షి) : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాప్రా మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గం మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్, దోమల నివారణ, ఫుడ్ సేఫ్టీ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల తీవ్రతను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.మంజూరైన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఉప్పల్ సర్కిల్ డిసి అనుచరి నాచారం సర్కిల్ డిసి నిత్యానంద్ కాప్రా సర్కిల్ డిసి రవీందర్ సాగర్, వివిధ విభాగాలు అధికారులు, బస్తి వాసులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ ప్రాంతాల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను స్వయంగా విన్న ఎమ్మెల్యే , సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రతి బస్తీని అభివృద్ధి పథంలో నడిపించడం తన ప్రాధాన్యత అని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు స్పష్టం చేశారు.ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డిసి ఆనంద్ నాచారం సర్కిల్ డిసి నిత్యానంద్ కాప్రా సర్కిల్ డిసి రవీందర్ సాగర్, వివిధ విభాగాలు అధికారులు, వివిధ కాలనీవాసులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి ఆరుగురు అరెస్ట్
రూ.21,210 నగదు, 156 పేక ముక్కలు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం

హయత్‌నగర్, నవంబర్ 10 (జనం సాక్షి)డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్ఓటీఎల్‌బీనగర్ బృందం, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దత్తాత్రేయ నగర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి మొత్తం రూ. 21, 210 నగదు, నేలపై ఉన్న 3 సెట్ల పేక ముక్కలు (156 కార్డులు), 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడటం చట్టవిరుద్ధమని, ఇలాంటి జూద కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అక్రమంగా పేకాట లేదా ఇతర జూద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు 8712662640 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి
జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి



రాజేంద్రనగర్,నవంబర్10(జనంసాక్షి)ఓటర్ల వివరాల ధృవీకరణ, జాబితాలో తప్పుల సవరణ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఈఆర్ఓ, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌పై కిస్మత్‌పూర్ జోనల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సమగ్ర పరిశీలన, వివరాల ధృవీకరణ, తప్పుల సవరణపై చర్చించారు. ఈ సమావేశంలో అత్తాపూర్ డీసీ మల్లయ్య, శంషాబాద్ డీసీ సుమన్ రావు, అరవింద్ రెడ్డి, నాయకులు ఎన్. మల్లారెడ్డి, కె. రవీందర్ రెడ్డి, ధనంజయ పాల్గొన్నారు.

ఘనంగా గూడ వీరేష్ జన్మదిన వేడుకలు
వీరేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శంకర్



కేశంపేట, నవంబర్ 10 (జనం సాక్షి) : కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గూడ వీరేష్ జన్మదిన వేడుకలను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే శంకర్ గూడ వీరేష్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వీరేష్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషా లతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ప్రజా సేవలోనూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతంలోనూ మరింత చురుకుగా పాల్గొంటూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. వీరేష్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకుడని, ఆయన అందిస్తున్న సేవలు పార్టీకి ఎంతో విలువైనవని పలువురు నాయకులు కొనియాడి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కేశంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్లూరి జగదీశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ శ్రీధర్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రంగు శంకర్, సీనియర్ నాయకులు రఘు నాయక్, చెంది తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, బాలరాజు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, రాయికల్ శ్రీనివాస్, కొమ్ము కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.


సీఎం ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



తాండూరు నవంబర్ 10(జనంసాక్షి)ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయం తో పాటు,ప్రభుత్వం తరపున అందే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. తాండూరు నియోజకవర్గం తాండూర్ గాంధీనగర్, ఇందిరా నగర్, పాత తాండూరు, బషీరాబాద్ మండలం జీవన్గీ, క్యాద్గిర తదితర గ్రామాలకు చెందిన పలువురికి రూ. 4 లక్షల సీఎం ఆర్థిక సహాయం నిధుల చెక్కులు అందించారు. ఇందిరానగర్ కు చెందిన దయానంద్ కుటుంబానికి రూ. 60 వేలు,గాంధీ నగర్ కు చెందిన కృష్ణమూర్తి కుటుంబానికి రూ. 50 వేలు, పాత తాండూర్ కు చెందిన మైముదాబేగం కు రూ. 20 వేలు, సయ్యద్ షకీల్ కు రూ. 60 వేలు, జీవన్గీ గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డి కి రూ. 83 వేలు, మడపతి శైలజకు రూ. 49,500, రమణారెడ్డి కుటుంబానికి రూ. 60 వేల ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు మాణిక్ రెడ్డి, సాయిరెడ్డి, రాజు, మైమూద్, జిలానీ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని వినతి



కేశంపేట, నవంబర్ 10(జనం సాక్షి) : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు మంగళవారం తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ లతోపాటు తమకు కూడా ఓటు హక్కు కల్పించే విధంగా ప్రభుత్వం చట్ట సవరణ చేయాలన్నారు. గ్రామ ప్రథమ పౌరులుగా ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచులకు తగిన గుర్తింపు కల్పిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రెండోసారి జ్యోతిబింభరత్

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా నియామకం



మొయినాబాద్ జనం సాక్షి సెప్టెంబర్ 10:మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా పామెన జ్యోతిబింభరత్ రెండోసారి నియమి తుల య్యారు. మహిళా విభా గం రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సోమవా రం రాష్ట్ర కమిటీతోపాటు జిల్లా అధ్యక్షుల ఎన్నికను ప్రకటించారు. ఈ సం దర్భంగా పామెన జ్యోతిభింభరత్న డోసారి నియమించారు. ఆమెకు జిల్లాలోని పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు

కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

మాజీ కౌన్సిలర్ ఆర్. మధుసూదన్ యాదవ్ డిమాండ్



కొడంగల్, నవంబర్ 10 (జనం సాక్షి): కొడంగల్‌ను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆర్. మధుసూద న్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ అభివృద్ధి పనులన్నీ హకీంపేటకు తరలిస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. గతంలో ఇచ్చిన రెవెన్యూ డివిజన్ హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్ ముదిరాజ్ పాల్గొన్నారు.

హాకీంపేట్ రైతు మేళాలో తాండూరుకు రూ.215 కోట్ల వరాలు

కాగ్నా తాగునీరు, పంచాయతీరాజ్ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి



తాండూరు నవంబర్ 10(జనంసాక్షి)మూడు రోజుల పాటు హాకీంపేట్ లో ఘనంగా నిర్వహించిన రైతు మేళా సమ్మేళనం వేదికగా తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తూ కీలక పనులకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలు శాఖల మంత్రులు, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. ఈరోజు హాకీంపేట్ వేదికగా మొత్తం రూ.215 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని అన్నారు. రూ.110 కోట్లతో కాగ్నా తాగునీరు.కాగ్నా ద్వారా కొడంగల్ – తాండూరు ప్రాంతాలకు మంచినీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేశారు. దీనితో తాండూరు, కొడంగల్ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్య తీరనుందని సీఎం తెలిపారు.రూ.105 కోట్లతో పంచాయతీరాజ్ పనులు.నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.అనంతరం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహకారంతో తాండూరు అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రూ.215 కోట్లతో చేపట్టిన ఈ పనులు నియోజకవర్గ రూపురేఖలను మార్చేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు 100 సీట్లు వస్తాయన్న మహేష్ గౌడ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ప్రజలు కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారు

బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు నగేష్ ముదిరాజ్



ముషీరాబాద్, నవంబర్ 10 (జనం సాక్షి):రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు వస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం. నగేష్ ముదిరాజ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు మంగళవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ పదవి త్వరలోనే ఊడిపోనుందని, మరోసారి ఆ పదవిని దక్కించుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి మెప్పు పొందే ప్రయత్నంలో భాగంగానే ఆయన భజన చేస్తున్నారని విమర్శించారు. కనీసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కూడా పొందలేని పరిస్థితిలో ఉన్న మహేష్ గౌడ్, బహిరంగ సభల్లో ముఖ్యమంత్రిని ఆకాశానికి ఎత్తడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడ్డాలు, ఫామ్‌హౌస్‌ల పేరుతో అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని నగేష్ ముదిరాజ్ విమర్శించారు. గడ్డం విషయంలో ముఖ్యమంత్రి మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనే గడ్డానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. మరి రేవంత్ రెడ్డి ఎవరిని చూసి గడ్డం పెంచుకున్నారని ప్రశ్నించారు. గడ్డాలు, ఫామ్‌హౌస్‌ల అంశాలను తెరపైకి తీసుకురావడం కేవలం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని ఆరోపించారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులకు రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్యంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రజా వ్యతిరేకతతో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కోల్పోవడం ఖాయమని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడంతో పాటు కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని నగేష్ ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుకు లయన్స్ క్లబ్ చేయూత

- **205 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ**
- **విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం**
- **నాణ్యమైన విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమన్న నైనా దేవి**



ఘట్కేసర్, నవంబర్ 10 (జనం సాక్షి):దేశ భవిష్యత్తు నేటి విద్యార్థుల చేతుల్లోనే ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసినప్పుడే దేశం ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా నిలుస్తుందని లయన్స్ క్లబ్ 320ఈ (న్యూ అపూర్వ) కోశాధికారి నైనా దేవి. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సామాజిక సంస్థలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపు మేరకు. విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ, ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరం కాకుండా ప్రతి విద్యార్థికి అవసరమైన సహకారం అందించాలనే ఉద్దేశంతో మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ సర్కిల్ 8వ డివిజన్ పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 205 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఈ ఏడాదే నూతనంగా ప్రారంభమైన లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ న్యూ అపూర్వ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు వంటి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ... విద్యార్థుల్లో చదువుతో పాటు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేలా ప్రోత్సహించడం తమ క్లబ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నట్లు నైనా దేవి వెల్లడించారు. చిన్నారులను ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం, పట్టుదల పెంపొందుతాయని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మన దేశానికి చెందిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం అమెరికా వంటి విదేశాలకు వెళ్తున్నారని, అయితే భవిష్యత్తులో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి విద్యార్థులు మన భారతదేశానికి వచ్చి చదువుకునే స్థాయికి దేశ విద్యావ్యవస్థ ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. అందుకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, క్రమశిక్షణ, నూతన ఆలోచనా విధానాలను అలవర్చేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దలు కృషి చేయాలని కోరారు. విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని, వారి అభివృద్ధికి చేసే ప్రతి చిన్న సహాయం దేశ భవిష్యత్తుకు పెట్టుబడిగా మారుతుందని వారు పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ న్యూ అపూర్వ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ హైదరాబాద్ న్యూ అపూర్వ క్లబ్ డిస్ట్రిక్ట్ 320 ఎ వారు అధ్యక్షులు వై. మైథిలి నరహరి, కార్యదర్శి సిహెచ్. అశోక్, రిట్రైర్డ్ డిప్యూటీ కలెక్టర్, ఫౌండర్ ఉ మెంబర్ ఆఫ్ ది క్లబ్, కోశాధికారి డాక్టర్ టి. నైనా దేవి, వై. నరహరి, రాజీవ్ గృహకల్ప వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుల్లంగుల బలరాం, రాజీవ్ గృహకల్ప కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంధమల్ల రమేష్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల అభ్యున్నతి, ఉజ్వల భవిష్యత్తు కోసం తమ వంతు సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు తెలిపారు.

ఉస్మానియా నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా

ఉద్యోగులకు మద్దతుగా ఈటల రాజేందర్, కల్వకుంట్ల కవిత, ఆర్. కృష్ణయ్య, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్



సికింద్రాబాద్, (జనం సాక్షి):ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమం ఉధృతమైంది. తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాన్ టీచింగ్ స్టాఫ్ సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట భారీ మహాధర్నా నిర్వహించారు. ఉద్యోగుల నినాదాలు, ఉద్యమ గీతాలతో ప్రాంగణం మార్మోగింది. న్యాయమైన హక్కులు సాధించే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ ధర్నాకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు హాజరై ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలు భరోసా లేకుండా జీవించడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో నెలకు రూ. 15 వేల వంటి తక్కువ వేతనాలతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఉద్యోగుల కష్టాలను అర్థం చేసుకుని స్పందించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. గతంలో పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగులను కూడా రెగ్యులరైజ్ చేసిన సందర్భాలున్నాయని, యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలకు మాత్రం పరిష్కారం లభించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సమస్యలు, గతంలో జరిగిన పరిణామాలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలను సమగ్ర డాక్యుమెంట్ రూపంలో జేఏసీ నాయకులు తనకు అందించాలని కోరారు. ఆ వివరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఈ అంశాన్ని వదిలిపెట్టబోనని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. కలవకుంట్ల కవిత మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులు ఇప్పటివరకు విడుదల చేయకపోవడంపై ప్రశ్నించారు. 35 ఏళ్లుగా నాన్ టీచింగ్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కొనసాగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగులు, అధ్యాపకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన వైస్ ఛాన్సలర్ కి అండగా నిలవకుండా ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పనిచేస్తున్న కాలపరిమితి వేతన, కాంట్రాక్టు ఉద్యోగులను పట్టించుకోకుండా కొత్త నియామకాలపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఏడాదిన్నరగా నిరసనలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. యూనివర్సిటీకి నిధులు మంజూరు చేయకుండా బిసిని బాధ్యుడిని చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంతో పోరాడాల్సిన బాధ్యత వీసీపై ఉందని కవిత అన్నారు. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులు ఇప్పటికీ హెల్త్ కార్డుల కోసం పోరాటం చేయడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖ మంత్రిగా ఉన్నందున తలుచుకుంటే ఒక్క నిమిషంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించవచ్చని, కానీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన యూనివర్సిటీలో అన్ని అధికారాలు వైస్ ఛాన్సలర్‌కు ఉన్నప్పటికీ, విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాల పేరుతో సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ డాక్టర్ వరంగల్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను నిబంధనలపై సిఎంసి అవగాహన కార్యక్రమం



శేరిలింగంపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) : 2026 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) ఆధ్వర్యంలో నూతన ఆస్తి పన్ను విధానం మరియు నిబంధనలపై మంగళవారం మాదాపూర్ లోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించడం జరిగింది. సిఎంసి కమిషనర్ నేతృత్వం వహించిన ఈ సమావేశంలో హారతి పన్నుకు సంబంధించిన కీలక నిబంధనలను విశదీకరిస్తూ చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మూడు జోన్ల జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, టాక్స్ ఇన్స్పెక్టర్లు మరియు బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు. క్యూర్ చట్టం, 2026 ప్రకారం ఆస్తి పన్నుకు సంబంధించిన కొత్త నిబంధనలు మరియు విధానాలపై క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని సిఎంసి కమిషనర్ వివరించారు. సవరించిన నిబంధనల గురించి పన్ను చెల్లింపుదారులకు సమర్థవంతంగా తెలియజేయడానికి, అలాగే ఆస్తి పన్ను నిర్ధారణ(అసెస్మెంట్) మరియు సంబంధిత ప్రక్రియలను కొత్త చట్టానికి అనుగుణంగా ఖచ్చితంగా అమలు చేయడానికి అవసరమైన పరిజ్ఞానాన్ని అధికారులకు అందించడం దీని ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంసి అదనపు కమిషనర్ (రెవెన్యూ) ఆస్తి పన్నుకు సంబంధించిన చట్టంలోని వివిధ నిబంధనలను వివరంగా వివరించారు. కొత్తగా ప్రవేశపెట్టిన క్యాపిటల్ వాల్యూ సిస్టమ్ ద్వారా ఆస్తి పన్నును ఎలా లెక్కించాలో ఉదాహరణలతోసహా వివరించారు. అలాగే, ఆస్తి పన్ను దరఖాస్తులు మరియు ఫైళ్లను ఆన్‌లైన్ ద్వారా ఎలా ప్రాసెస్ చేయాలో కూడా అధికారులకు తెలియజేశారు. సవరించిన నిబంధనలను ఏకరీతిగా అమలు చేయడం, పన్ను చెల్లింపుదారులకు సరైన మార్గనిర్దేశం చేయడం మరియు క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు కొత్త విధానాలను ఖచ్చితంగా పాటించడం యొక్క ప్రాముఖ్యతను ఈ కార్యక్రమంలో నొక్కి చెప్పారు. చివరగా జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. దీని ద్వారా కొత్త నిబంధనలు మరియు విధానాలపై వారికి పూర్తి అవగాహన కలిగిందని పలువురు అధికారులు వెల్లడించారు.

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పోరాటం ఫలించింది

అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి: లక్ష్మీకాంత్‌రెడ్డి



మల్కాజిగిరి నవంబర్10(జనం సాక్షి)ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయిన అర్హులకు తిరిగి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటం ఫలించిందని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ విజ్ఞప్తుల మేరకు స్పందించిన ఎన్నికల కమిషన్ దరఖాస్తుకు ఈ నెల 21 వరకు గడువు పొడిగించిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సారథ్యంలో మెదక్, మల్కాజిగిరి ప్రాంతాల నుంచి దాదాపు 100 కార్లలో దిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు వివరించారు.నివాసం మారడం, ఇతర ప్రాంతాల్లో పేర్లు ఉండటం తదితర కారణాలతో జాబితా నుంచి తొలగించిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అర్హులైన పౌరులు తమ గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ఒక్కరూ కూడా నష్టపోవద్దన్నదే తమ లక్ష్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్, నాయకులు వెంకటేశ్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, సతీష్‌కుమార్, పిట్టల శ్రీనివాస్, అశోక రెడ్డి, ఎస్ఆర్ ప్రసాద్, సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్‌గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, నాగరాజు, రాఘవన్, లక్ష్మి, ఆశా తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో మెరిడియన్ విద్యార్థి సత్తా.. వీరేందర్ యాదవ్‌కు బంగారు పతకం!

70వ ఎస్‌జీఎఫ్ఐ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్--14 పోటీల్లో ప్రథమ స్థానం



బోడుప్పల్-జనంసాక్షి::ఆర్చరీ పోటీల్లో మెరిడియన్ స్కూల్ విద్యార్థి రసాల వీరేందర్ యాదవ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. 70వ ఎస్‌జీఎఫ్ఐ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్--14 ఆర్చరీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.నవంబర్ 7, 2026న హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో వీరేందర్ తన ఏకాగ్రత, నైపుణ్యం, పట్టుదలతో ప్రత్యర్థులను అధిగమించి విజేతగా నిలిచాడు. చిన్న వయసులోనే ఆర్చరీపై ఆసక్తి పెంచుకున్న అతడు గత రెండేళ్లుగా క్రమం తప్పకుండా సాధన చేస్తూ తన ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నాడు. ఇప్పటికే జాతీయ స్థాయి పోటీల్లో టాప్--10లో స్థానం సంపాదించి తన ప్రతిభను చాటుకున్నాడు.వీరేందర్ విజయానికి కోచ్‌లు బండి స్వామి, ఈశ్వర్ అందిస్తున్న శిక్షణ, మార్గదర్శకత్వం కీలకంగా నిలిచాయి. మెరిడియన్ స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, క్రీడా విభాగం అందిస్తున్న ప్రోత్సాహం కూడా అతడి విజయానికి తోడ్పడుతోంది. ఈ సందర్భంగా వీరేందర్ తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి, కోచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన వీరేందర్‌ను క్రీడాభిమానులు, శ్రేయోభిలాషులు అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పోలీసు అధికారులను సన్మానించిన బిజెపి నాయకులు



కేశంపేట, నవంబర్ 10(జనం సాక్షి): మండల పోలీస్ స్టేషన్లో ఇటీవల బాధ్యతలు తీసుకున్న సీఐ బి. శ్రీనివాస్, ఎస్సై పరమేష్ లను బిజెపి మండల అధ్యక్షులు పాలాది శ్రీనివాస్ అధ్యర్యంలో బిజెపి నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతి భద్రతలు, సమస్యలపై చర్చించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రోల్లు రఘురాం గౌడ్, కంచుకోట నర్సింహా, మున్నూరు యుగంధర్, తట్టేపల్లి నరసింహ పాల్గొన్నారు.

మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలి

రాజేంద్రనగర్లో నిరసన



రాజేంద్రనగర్, నవంబర్7(జనంసాక్షి) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జానయ్యపై మహిళా ప్రొఫెసర్ చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం విశ్వవిద్యాలయంలో భారీ నిరసన చేపట్టారు. తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం , నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని, విచారణ పారదర్శకంగా జరిగేందుకు వైస్ ఛాన్సలర్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని ముఖ్యమంత్రిని కోరారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

జనంసాక్షి

మెరిడియన్ స్కూల్‌పై అక్రమ షెడ్ నిర్మాణం

పాఠశాలలో విద్యార్థులకు యథావిధిగా తరగతులు నిర్వహిస్తుండగానే భవనంపై అదనపు ఫ్లోర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలను పక్కనపెట్టి పనులు చేపడుతున్నారా? అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. ఒకవైపు తరగతి గదుల్లో చిన్నారులు చదువుకుంటుంటే మరోవైపు భవనంపై నిర్మాణ పనులు జరగడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

ఒక్క చిన్న నిర్లక్ష్యం.. పెను ప్రమాదానికి దారితీస్తే?

నిర్మాణ పనుల సమయంలో ఇటుకలు, ఇనుప రాడ్లు, ఇతర సామగ్రి కిందపడే ప్రమాదం ఉండటంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. నిర్మాణాల నుంచి వెలువడే దుమ్ము, ధూళి, శబ్దం పిల్లల ఆరోగ్యంపై, చదువుపై ప్రభావం చూపే అవకాశం ఉందని తల్లిదండ్రులు చెబుతున్నారు. నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రాంతాన్ని విద్యార్థులకు పూర్తిగా దూరంగా ఉంచి, తగిన భద్రతా ఏర్పాట్లు చేశారా? అనే అంశంపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

అనుమతులు లేకుండా అదనపు అంతస్తు నిర్మిస్తున్నారా?

పాఠశాల భవనానికి జీహెచ్ఎంసీ మంజూరు చేసిన అసలు బిల్డింగ్ పర్మిషన్ ఎన్ని అంతస్తులకు ఉంది? ప్రస్తుతం చేపడుతున్న అదనపు ఫ్లోర్‌కు ప్రత్యేక అనుమతి తీసుకున్నారా? భవనం అదనపు భారాన్ని తట్టుకునే సామర్థ్యంపై నిపుణుల పరిశీలన జరిగిందా? అగ్నిమాపక శాఖ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు ఉన్నాయా? అన్న అంశాలను అధికారులు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది. కేవలం నిర్మాణం జరుగుతోందన్న కారణంతోనే అక్రమమని నిర్ధారించలేము. అయితే అనుమతులు, భద్రతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సమగ్ర తనిఖీ తప్పనిసరి.



ఎంఇఓ , డిఇఓ గారూ.. మీ బాధ్యత లేదా?

విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశంపై మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి తక్షణమే స్పందించాలి. పాఠశాలను సందర్శించి తరగతులు జరుగుతున్న సమయంలో నిర్మాణ పనులు ఎలా కొనసాగుతున్నాయో పరిశీలించాలి. పాఠశాల భవనానికి సంబంధించిన అనుమతులు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత శాఖల నుంచి నివేదికలు తెప్పించాలి. అవసరమైతే మున్సిపల్ టౌన్ ప్లానింగ్, అగ్నిమాపక శాఖ అధికారులతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలి. విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని తేలితే భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యే వరకు ప్రమాదకర ప్రాంతాల్లో పనులు నిలిపివేయించేలా చర్యలు తీసుకోవాలి.

ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. పిల్లల భద్రతపై లేదా?

ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు వారికి కనీస భద్రత కల్పించాల్సిన బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యం కూడా అదనపు అంతస్తు నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలు, భవన భద్రతా వివరాలను తల్లిదండ్రులకు వెల్లడించాలని కోరుతున్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత విచారణలు జరిపి ప్రయోజనం ఏమిటి?

మెరిడియన్ పాఠశాల వ్యవహారంపై అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పాఠశాల యాజమాన్యం నుంచి వివరణ తీసుకుని, నిర్మాణ అనుమతుల వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి. చిన్నారుల భవిష్యత్తుతో పాటు వారి ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత విద్యాశాఖ, మున్సిపల్ అధికారులపై ఉంది. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన తర్వాత స్పందిస్తారా? లేక ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకుంటారా? ఇప్పుడు కూకట్‌పల్లి తల్లిదండ్రులు ఎంఇఓ , డిఇఓ అధికారులను అడుగుతున్న ప్రశ్న ఇదే!

కొడంగల్‌కే అభివృద్ధి పరిమితమా?

- **జిల్లాలోని మిగతా 3 నియోజకవర్గాలు ముఖ్యం కావా?**
- **బీజేపీ జిల్లా అధ్యక్షులు యు. రమేశ్ కుమార్.**

తాండూరు నవంబర్ 10 (జనంసాక్షి) : తాండూరు, వికారాబాద్, పరిగి అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు యు. రమేశ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపైనే ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వికారాబాద్ జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాలను విస్మరిస్తున్నారా? జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నప్పుడు అన్నింటికీ సమాన ప్రాధాన్యత ఎందుకు ఇవ్వడం లేదు? ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదా?.ముఖ్యంగా తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్యులు, నిపుణులు, సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన వైద్య పరికరాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా వినియోగించుకునే పరిస్థితి లేదు. ఈ ప్రాంతంలోని వేలాది మంది కార్మికులు, సామాన్య ప్రజలు, రైతులకు నాణ్యమైన వైద్యం అందడం లేదు.అలాగే తాండూరు తో పాటు వికారాబాద్ పరిగి ప్రాంతాల్లో (నాపరాతి గనులు మినహా) , బెంటోనైట్, ఇసుక, ఎర్రమట్టి వంటి సహజ వనరులు ఉన్నప్పటికీ అక్రమ మైనింగ్, రాయల్టీ చెల్లించకుండా ఎర్రమట్టి తరలింపుపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? మరోవైపు అనావృష్టి, ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే వారికి భరోసా కల్పించాల్సిన అవసరం లేదా.



ప్రభుత్వానికి మా ప్రధాన డిమాండ్లు:

తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించి, సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ప్రకటించాలి. తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, నిపుణులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసి, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి.

. అక్రమ మైనింగ్, ఎర్రమట్టి అక్రమ రవాణాపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి, వ్యవసాయానికి అవసరమైన సహాయం కల్పించాలి. విద్యార్థులు, పశుపోషకులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా నిద్రమత్తు వీడి కొడంగల్‌తో పాటు మిగతా మూడు నియోజకవర్గాల అభివృద్ధిక సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. మీరు ఈ జిల్లా నుంచి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత మీపై ఉంది.కొడంగల్ ఒక్కటే వికారాబాద్ జిల్లా కాదు.. నాలుగు నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధే మా డిమాండ్.

ఓటుహక్కు కోల్పోయిన వారికి మరో అవకాశం

నవంబర్ 21 వరకు గడువు

అర్హులైన ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి తహసీల్దార్ క్రిష్ణయ్య

చేవెళ్ల, నవంబర్ 10 (జనంసాక్షి): ఓటరు జాబితాలో చోటు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును తిరిగి పొందేందుకు ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణయ్య కోరారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోయిన వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు నవంబర్ 21వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వెల్లడించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చేవెళ్ల మండలం, మున్సిపాలిటీకి సంబంధించి ఏఎస్‌డీడీ (హాజరుకాని వారు, చిరునామా మారినవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువసార్లు ఓటరుగా నమోదైనవారు) జాబితాలో మొత్తం 12,554 మంది ఉన్నట్లు తెలిపారు. ఇందులో చేవెళ్ల మండల పరిధిలో 6,035 మంది, మున్సిపాలిటీ పరిధిలో 6,519 మంది ఉన్నారని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లు కొత్తగా ఫారం-6 సమర్పించాల్సిన అవసరం లేదని, గతంలో జారీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి, ఇంతకుముందు ఎందుకు సమర్పించలేకపోయారో వివరిస్తూ సంబంధిత డిక్లరేషన్‌తో పాటు అవసరమైన పత్రాలను అధికారులకు అందజేయాలని సూచించారు. ఇప్పటికే ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఓటర్లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారి బీఎల్ఓను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారాలు పొందవచ్చని, పూర్తి చేసిన ఫారాలను బీఎల్ఓ లేదా సంబంధిత ఏఈఆర్ఓకు అందజేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఏఎస్‌డీడీ జాబితాలను నోటీసు బోర్డులపై ప్రదర్శించడంతోపాటు అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. కావున చేవెళ్ల మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న అర్హులైన ఓటర్లు నవంబర్ 21వ తేదీలోగా ఫారాలు సమర్పించి తమ ఓటుహక్కును పునరుద్ధరించుకోవాలని తహసీల్దార్ క్రిష్ణయ్య కోరారు. మరిన్ని వివరాలకు సంబంధిత బీఎల్ఓను సంప్రదించాలని లేదా ఎన్నికల సంఘం టోల్‌ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేయాలని సూచించారు.



కొడంగల్‌తో సమానంగా తాండూరుకు నిధులు కేటాయించాలి

మున్సిపల్ కౌన్సిలర్ పటేల్ సుప్రీతా కరుణాకర్

తాండూరు నవంబర్ 10(జనంసాక్షి) : కొడంగల్‌తో సమానంగా తాండూరు అభివృద్ధికి నిధులు కేటాయిం చాలని ముఖ్యమంత్రిని వార్డు నంబర్ 34 మున్సిపల్ కౌన్సిలర్ పటేల్ సుప్రీతా కరుణాకర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొడంగల్ అభివృద్ధికై తాండూరు కాగ్న నది ఇసుక, ఎర్ర మట్టి, కాగ్న నది జల వనరులు తీసుకుంటున్న ప్పుడు మరి తాండూ రు అభివృద్ధిని పట్టించుకోకపోవడం చాలా శోచనీయమని అన్నారు. తాండూరు ఆసుపత్రిలో పరికరాలు, సిబ్బంది లేక నిరుపయోగమై ప్రజలు వైద్య సౌకర్యాల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి చిన్న సమస్యకు హైదరాబాద్ ఆసుపత్రులకు తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. మన ముఖ్యమంత్రికి కొడంగల్ పై ఉన్న ప్రేమ, మిగతా నియోజకవర్గాల పట్ల చూపుతున్న వివక్ష చాలా బాధాకరమని



ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి రైతులకు పంటలు వేయొద్దని చెప్పడం తెలుసు కానీ, రైతులకు రైతుబంధు ఇవ్వాలని ఆలోచన లేకపోవడం చాలా విచారకరం. తాండూరును విద్యారంగంలో పెద్దపీట వేయాలని తాండూరు వాసులు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. ఉన్న వనరులను తీసుకుపోతూ తాండూరు ప్రజలకు ముఖ్యమంత్రి తీరని అన్యాయం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.

చికిత్స పొందుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత అబ్దుల్ రావుఫ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

తాండూరు నవంబర్ 10(జనంసాక్షి) : హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఎఐజీ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు అబ్దుల్ రావుఫ్‌ని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అబ్దుల్ రావుఫ్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నాను. వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



భక్తి పారవశ్యంలో ధారూర్ మెథడిస్ట్ మహాజాతర

- బిషప్‌ల ప్రార్థనలతో 104వ ఉత్సవాలకు శ్రీకారం
- కాగ్నా నది తీరాన భక్తుల ఆధ్యాత్మిక సందడి
- భద్రతకు పటిష్ఠ పోలీసు బందోబస్తు
- వైద్య శిబిరం, పారిశుధ్యం, తాగునీటిపై అధికారుల నిఘా



ధారూర్, నవంబర్ 10 (జనం సాక్షి): యేసుక్రీస్తు నామస్మరణ, ఆధ్యాత్మిక గీతాలాపనలు, ప్రత్యేక ప్రార్థనలతో ధారూర్ మెథడిస్ట్ క్రైస్తవ మహాజాతర భక్తి పారవశ్యంలో ప్రారంభమైంది. ఆసియాలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ జాతర 104వ ఉత్సవాలకు మంగళవారం బిషప్‌లు డాక్టర్ ఏ. సైమన్ తదితరులు శ్రీకారం చుట్టారు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని ధారూర్ స్టేషన్, దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా ఉపనది తీరాన ఏర్పాటు చేసిన విశాలమైన జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన ముఖద్వారం వద్ద బిషప్‌లు రిబ్బన్ కత్తిరించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం యేసుక్రీస్తు శిలువల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, కొవ్వొత్తులు వెలిగించారు. భజన బృందాల కీర్తనలు, ప్రార్థనలతో ప్రాంగణం మార్మోగింది.

ప్రధాన వేదికపై జాతర కమిటీ నిర్వాహకులు బిషప్‌లకు శాలువాలు, పూలమాలలతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా వారు యేసుక్రీస్తు ప్రేమ, శాంతి, కరుణ సందేశాన్ని భక్తులకు అందించారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, సమాజంలో శాంతి, సోదరభావం వెల్లివిరియాలని ప్రార్థించారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి క్రైస్తవ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో కాగ్నా నది తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన ప్రవేశ మార్గాలు, రద్దీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు.

జాతర ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎంపీడీవో నరసింహులు, ఎంపీఓ శ్రీకాంత్ పర్యటిస్తూ పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షిస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. భక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సేవలందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశారు. జాతర ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ నిర్వాహకులు స్టీవెన్, పాస్టర్లు, రాజు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





పట్టా చేసే వరకూ పోరాటం: దుబ్బాక రాంచందర్

మూడో రోజు రిలే దీక్షకు రాష్ట్ర రైతు సంఘం సంపూర్ణ మద్దతు



యాచారం, నవంబర్ 10(జనం సాక్షి) యాచారం మండలం తులేఖుర్దు రెవెన్యూ పరిధిలోని ధర్మన్నగూడ గ్రామ నిరుపేద రైతులు తేరటి పుణ్యాలు, నిర్మల దంపతులకు చెందిన 167 సర్వే నంబరులోని 3-20 ఎకరాల భూమిని ఆకుల కోటయ్య వెంటనే పట్టా చేసే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర రైతు సంఘం నాయకులు, జిల్లా కార్యదర్శి దుబ్బాక రాంచందర్ స్పష్టం చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ వద్ద డీవైఎఫ్ఐ గౌరవ అధ్యక్షులు జక్కుల ఆనంద్ అధ్యక్షతన జరిగిన మూడో రోజు రిలే దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. గత నలభై ఏళ్ల క్రితమే డబ్బులు తీసుకుని, 1277/1992 డాక్యుమెంట్ నంబరుతో అగ్రిమెంట్ రాసిచ్చి, పట్టా చేస్తానని నమ్మించి మోసం చేస్తున్న ఆకుల కోటయ్య దౌర్జన్యాన్ని తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. నలభై ఏళ్లుగా పట్టా ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, తన కొడుకు ఆకుల శ్రీనివాస్ పేరుతో దొంగతనంగా జీపీఏ చేసుకుని నిరుపేదల భూమిని కబ్జా చేయడానికి యత్నించడం అత్యంత అన్యాయమని మండిపడ్డారు.

ఈ సందర్భంగా దేవాదాయ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మండల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆకుల కోటయ్య తక్షణమే స్పందించి బాధితులకు పట్టా అందజేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మండల బాలరాజ్, మాజీ వైస్ ఎంపీపీ ముక్కెర శ్రీమన్నారాయణ, సీపీఎం పార్టీ గ్రామ కార్యదర్శులు పెరుమాండ్ల రమేష్, మండల గోపాల కృష్ణ, గ్రామ ఉప సర్పంచ్ గౌర రాజు, మాజీ ఉప సర్పంచ్ పాండు చారి, బీజేపీవైఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పుప్పాల శాంతికుమార్, బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పుప్పాల అనిల్, ధర్మన్నగూడ భూ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బండ మల్లేష్, కొంపోజు సురేష్ చారి, మండల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

గుర్ల తిరుమలేష్ పడిపూజకు కెటిఆర్ రాక

శేరిలింగంపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) : ఈనెల 15న నేతాజీ నగర్ పరిధి గుల్మోహర్ పార్కులో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్ల తిరుమలేష్ గౌడ్ నిర్వహించ తలపెట్టిన అయ్యప్ప మహా పడిపూజకు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కెటిఆర్) ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తిరుమలేష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తిరుమలేష్ గౌడ్ నగరంలోని కేటీఆర్ ఇంటికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని అయ్యప్ప మహా పడిపూజకు సాదరంగా ఆహ్వానించగా తప్పకుండా వస్తానని, తాను కూడా ఆధ్యాత్మిక చింతన కలిగిన వ్యక్తినేనని ఈ సందర్భంగా తెలపడం గమనార్హం. కెటిఆర్ రాకను పురస్కరించుకొని



గుల్మోహర్ పార్కులో శేరిలింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తిరుమలేష్ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాకిటి శంకర్, వడ్డే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. ప్రకృతిని రక్షించాలి

అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ



మహేశ్వరం,నవంబర్10(జనంసాక్షి): ప్రతి ఒక్కరూ శుభ సమయాల్లో మొక్కలు నాటాలని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ అన్నారు.మంగళవారం అవేర్ లో అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.పలువురు రాజకీయ ప్రముఖులు మాధవన్ జీ చేత కేక్ కట్ చేయించి,పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ మాట్లాడుతూ...ప్రకృతిని ప్రతి ఒక్కరూ రక్షించాలన్నారు.అవేర్ సంస్థ పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కేరళ ఆయుర్వేద ఆసుపత్రిని అవేర్ సంస్థలో ఏర్పాటు చేశామన్నారు. ఆయుర్వేద వైద్య చికిత్స సేవలు నిపుణులచే అందిస్తున్నామన్నారు.అవేర్ ను హెల్త్ యూనివర్సిటీగా మారుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అవేర్ సంస్థ ప్రతినిధులు వరుణ్, తరుణ్, గణేష్, వెంకన్న, అవేర్ సంస్థ ప్రతినిధులు,పలు రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివాహ ఆహ్వానం అందజేసిన కుమార్ గౌడ్



మొయినాబాద్ నవంబర్ 10 జనం సాక్షి : షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తో కలిసి అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసిన కుమార్ గౌడ్ తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు లింగారపు కుమార్ గౌడ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను ప్రత్యేకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు వెంట కుమార్ గౌడ్ అమరావతికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన కుమార్తె రాజేశ్వరి వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని ముఖ్యమంత్రిని కోరారు. లింగారపు కళావతి, దివంగత రామచంద్రయ్య గౌడ్‌ల కుమార్తె రాజేశ్వరికి, గొల్లూరు వాస్తవ్యులు ఎలగని స్వరూప రాణి, మనోహన్ గౌడ్‌ల కుమారుడు విష్ణేష్ గౌడ్‌తో ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 10.16 గంటలకు వివాహం జరగనుంది. శంషాబాద్‌లోని శాంకరాయి వద్ద ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపంలోని ఎస్.ఎస్. కన్వెన్షన్ సెంటర్‌లో ఉత్తరాషాఢ నక్షత్రయుక్త ధనుస్సు లగ్నంలో వివాహ వేడుక నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసి, తప్పకుండా వివాహానికి విచ్చేయాలని కుమార్ గౌడ్ ప్రత్యేకంగా ఆహ్వానించారు.

బోడుప్పల్‌లో రూ.1.25 కోట్లతో సీసీ రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్



బోడుప్పల్-జనంసాక్షి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్‌లో గల సుభోదయ కాలనీ, గ్రీన్ సిటీ కాలనీ, శ్రీలక్ష్మీనగర్, వివేక్ నగర్, లెక్చరర్స్ కాలనీలలో సుమారు రూ.1 కోటి 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల అభివృద్ధి పనులను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ బోడుప్పల్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ డివిజన్ అధ్యక్షులు పొగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,

చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పొగుల దిలీప్ రెడ్డి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చంద్రయ్య అకాల మరణం.. బీఆర్ఎస్‌కు తీరని లోటు

- మాజీ సర్పంచ్ చంద్రయ్య మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రగాఢ సంతాపం.
- పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని వెల్లడి.



ధారూర్,నవంబర్ 10(జనంసాక్షి) : ధారూర్ మండలం గడ్డమీది గంగారం మాజీ సర్పంచ్ కురుమ చంద్రయ్య అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. చంద్రయ్య మరణవార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంటూ, ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి చంద్రయ్య చేసిన కృషి, ప్రజలతో ఆయనకున్న అనుబంధం ఎప్పటికీ మరువలేనివని అన్నారు.మాజీ సర్పంచ్‌గా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ తనదైన సేవలు అందించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో నిబద్ధతతో పనిచేసే నాయకులను కోల్పోవడం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.చంద్రయ్య అకాల మరణంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారని అన్నారు.ఈ కష్ట సమయంలో చంద్రయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ,వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అండగా నిలవాలని కోరారు. చంద్రయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ,ఆయన సేవలను ఎప్పటికీ స్మరించుకుంటామని తెలిపారు.కురుమ చంద్రయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఆయన వెంబడి సీనియర్ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు కే,వేణుగోపాల్ రెడ్డి,మండల పార్టీ మాజీ అధ్యక్షులు పి,శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి,లు ఉన్నారు.

జిఎస్ఐ నూతన శిక్షణ, సామర్థ్యాభివృద్ధి కేంద్రాల

ప్రారంభోత్సవంలో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి

హయత్‌నగర్, నవంబర్ 10 (జనం సాక్షి) : భారతదేశంలో భౌగోళిక పరిశోధనలు, ఖనిజ వనరుల అన్వేషణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధిని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) ఆధ్వర్యంలో నూతన శిక్షణ, సామర్థ్యాభివృద్ధి కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమం నవంబర్ 10, 2026న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ దినేష్ వి. గన్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా పలు అత్యాధునిక సదుపాయాలను ప్రారంభించారు. వీటిలో శిక్షణార్థుల కోసం నిర్మించిన ఇంటర్నేషనల్ హాస్టల్స్, ఆధునిక భౌగోళిక పరిశోధనలు, డేటా విశ్లేషణకు ఉపయోగపడే అడ్వాన్స్‌డ్ జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ లాబొరేటరీ, డిజిటల్ విధానంలో శిక్షణ, బోధన అందించేందుకు ఏర్పాటు చేసిన కర్మయోగి డిజిటల్ స్టూడియో ఉన్నాయి.



ఈ నూతన సదుపాయాలు దేశ ఖనిజ రంగ అభివృద్ధికి, పరిశోధనా సామర్థ్యాల పెంపునకు, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణా సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తులో ఈ రంగంలో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్.బి. నగర్ బీజేపీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, నాగోల్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో వ్యక్తి అదృశ్యం



శంషాబాద్,నవంబర్10(జనంసాక్షి) : శంషాబాద్ మండలం సిద్ధంతి గ్రామానికి చెందిన కడమంచి రాములు (32) ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కనిపించడం లేదు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అదృశ్యమైన సమయంలో బూడిద రంగు టీషర్ట్, ప్యాంటు ధరించి ఉన్నాడు. తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడు. గతంలో జరిగిన ప్రమాదంలో ఎడమ చేయి తొలగించబడింది. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

కేశంపేట నవంబర్ 10 (జనం సాక్షి) : ఎల్ నినో ప్రభావంతో గ్రామాలలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులు సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మిషన్ భగీరథ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెటర్నరీ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు.నీటి ఎద్దడి లేకుండా ప్రత్యామ్నాయ బోరుబావులను గుర్తించడంతోపాటు మంచినీటి పైప్ లైన్ లీకేజీలను అరికట్టడం, త్రీఫేజ్, సింగిల్ ఫేస్ మోటార్లకు మరమ్మత్తులు చేయించడం, అవసరమైన చోట కొత్త మోటార్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడిఓ రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ... జల



శ్రీ కార్యక్రమంలో భాగంగా మంజూరైన బోర్ వెల్ రీఛార్జ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వీబీ -జీ రామ్ జీ పథకం కింద ఉపాధి పనులను గుర్తించాలన్నారు. ఫామ్ పాండ్ ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈలు ప్రదీప్, నరేష్, మండల వైద్యాధికారి డాక్టర్ సబితా రెడ్డి , ఏపీఎం కవిత పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే లక్ష్యం.. ఆపదలో ఉన్న నారాయణరెడ్డికి సీపీఐ అండ

- ప్రమాదంలో గాయపడిన పార్టీ నాయకుడికి రూ.1.75 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 10(జనం సాక్షి):భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో పనిచేస్తున్న ప్రతి కార్య కర్తకు, వారి కుటుంబాలకు పార్టీ నాయకత్వం అండ గా ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందో జు రవీంద్ర చారి అన్నారు.అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యవర్గ సభ్యులు సీహెచ్ నారాయణరెడ్డి గత సంవత్సరం వృత్తి నిర్వహణలో భాగంగా ప్రమాదవశా త్తు భవనంపై నుంచి కిందపడటంతో వెన్నుపూసకు తీవ్ర గాయమై ంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆయనకు సుమారు రూ.8 లక్షలు వెచ్చించి వైద్యం చేయించగా, అప్పటి నుంచి ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో నారాయణరెడ్డికి రూ.1,75,000 సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈ మేరకు మంగళవారం కోహెడలోని ఆయన నివాసానికి వెళ్లిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్ కలిసి చెక్కును నారాయణరెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు కష్టసుఖాల్లో సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్మికులు పని ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి కార్మికుడు లేబర్ కార్డు పొందడంతో పాటు, దాని ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ప్రయోజనాలను వినియోగించుకోవాలని కోరారు. కార్మికుల భద్రతకు ప్రభుత్వాలు ప్రాధాన్యతనివ్వాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కార్మికుల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. నారాయణరెడ్డి కుటుంబానికి పార్టీ తరఫున అన్ని విధాలుగా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా జీవించిన నాయకుడు సంజీవ

రంగారెడ్డి, నవంబర్ 10 (జనం సాక్షి): పదవుల కోసం పాకులాడకుండా పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జీవితాంతం పనిచేసిన నాయకుడు చేతాళ్ల సంజీవ అని వివిధ పార్టీల నాయకులు కొనియాడారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేతాళ్ల సంజీవ రెండో వర్ధంతి సందర్భంగా జాపాల్ గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, నిరుపేదలకు తనవంతు సహాయ సహకారాలు అందించిన సంజీవ సేవలు మరువలేనివన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. మనిషి ఎంతకాలం జీవించాడన్నది ముఖ్యం కాదని, ఎంతమంది హృదయాల్లో నిలిచిపోయాడన్నదే ముఖ్యమన్నారు. పదవులు లేకపోయినా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏడుమ నరేందర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ జయమ్మ, మాజీ సర్పంచులు చీమల జంగయ్య, బోల జగన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జంగేం వెంకటేష్, బీఆర్ఎస్ నాయకుడు బి.ఎన్. జ్ఞానేశ్వర్, సీపీఎం నాయకులు జగన్, ఎల్. నరసింహారెడ్డి, సంజీవ కుమారులు చేతాళ్ల సందీప్ కుమార్, చేతాళ్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో స్వర్ణ పతకం

- టంగుటూరు బిడ్డకు ఘన సన్మానం..
- వృక్షశాస్త్రంలో ప్రథమ స్థానం సాధించి గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్న ఆకంగళ్ల రమణీనీల



శంకర్ పల్లి, నవంబర్ 10 (జనం సాక్షి) : శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామానికి చెందిన ఆకంగళ్ల జంగయ్య కుమార్తె ఆకంగళ్ల రమణీనీల ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ వృక్షశాస్త్రం (బోటనీ)లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా టంగుటూరులో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొని రమణీనీలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎం. యాదయ్య, డాక్టర్ సాయి సింధు, సామాజిక కార్యకర్త మర్వల్లి అశోక్,ఉపాధ్యాయుడు ఏ. నర్సింలు మాట్లాడుతూ.. నిరంతర కృషి, పట్టుదల, అంకితభావంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రమణీనీల విజయం నిరూపించిందన్నారు. ఆమె సాధించిన స్వర్ణ పతకం తల్లిదండ్రులు, గురువులు, గ్రామానికి గర్వకారణమని, విద్యార్థినులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.భవిష్యత్తులో పరిశోధనా రంగంలోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆకంగళ్ల గోపాల్, ఉపసర్పంచ్ సత్తయ్య, ఎం.శంకరయ్య,ఎం.బాలయ్య,హరిశ్రీవస్తవ్, జంగయ్య,అనితా దేవి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు 41 రోజులపాటు నిత్య అన్నదానం

సురేష్ స్వామి ఆధ్వర్యంలో బృహత్తర సేవా కార్యక్రమం

అల్మాపురి టౌన్‌షిప్ (జనం సాక్షి): అయ్యప్ప స్వాముల సేవే భగవంతుడికి చేసే సేవగా భావిస్తూ ఐడియల్ బిల్డర్స్ సురేష్ స్వామి ఆధ్వర్యంలో అల్మాపురి టౌన్‌షిప్ రోడ్ నంబర్ 13లో 41 రోజులపాటు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా కొనసాగిస్తున్న ఈ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది కూడా అయ్యప్ప మాలధారులు, భక్తులకు ఉచితంగా అన్నప్రసాదం అందిస్తున్నారు.
ప్రతిరోజూ మధ్యాహ్నం సంపూర్ణ భోజనం, సాయంత్రం వేళల్లో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. రోజుకు సుమారు 2,500 మందికి పైగా అయ్యప్ప స్వాములు, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. మాలధారణలో ఉన్న 150 మంది స్వాములకు ఉచితంగా బస చేసేందుకు, పూజాధికాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక సన్నిధానాన్ని ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా భక్తిశ్రద్ధలతో అన్నదాన సేవలను కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప స్వాములు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని ఐడియల్ బిల్డర్స్ సురేష్ స్వామి, నిర్వాహక సభ్యులు కోరారు. అన్నదానం, వసతి సేవల ద్వారా స్వాములకు సేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.